ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ

- హైస్కూళ్లలో ఆరుబయటే సైకిళ్ల పార్కింగ్
- నిడదవోలు నియోజకవర్గ వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- పార్కింగ్ షెడ్లు నిర్మించాలని విద్యార్థుల వినతి


ఖండవల్లి ఉన్నత పాఠశాలలో ఎండలో ఉన్న సైకిళ్లు


కాకరపర్రు ఉన్నత పాఠశాలలో చెట్ల కింద సైకిళ్ల పార్కింగ్

పెరవలి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.కోట్లు వెచ్చిస్తున్నామంటూ ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్నా, పలు పాఠశాలల్లో కనీస వసతులు కూడా కొరవడ్డాయి. చాలా ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు సైకిళ్లు పెట్టుకోవడానికి షెడ్డులు లేవు. దాంతో విద్యార్థుల సైకిళ్లు ఆరుబయట ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పాడైపోతున్నాయి. నిడదవోలు నియోజకవర్గంలో 28 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఏ ఒక్క పాఠశాల్లో కూడా సైకిళ్ల షెడ్డులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పాఠశాలలకు పార్కింగ్ స్థలాలే లేవు. దాంతో విద్యార్థులు రోడ్లపైన, చెట్ల కింద సైకిళ్లు పెట్టుకుంటున్నారు. వర్షం కురిస్తే నేలంతా బురదగా మారి, ఆ బురదలో సైకిళ్లు కూరుకుపోతున్నాయి. స్కూల్ ముగిశాక తమ సైకిళ్లను బురదలో నుంచి రోడ్డుమీదకు తెచ్చుకునేందుకు విద్యార్థులు నానా అగచాట్లు పడుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

నిడదవోలు నియోజకవర్గంలో 28 ఉన్నత, 156 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వాటిలో సుమారు 40 వేల మంది విద్య అభ్యసిస్తున్నారు. కేవలం ఉన్నత పాఠశాలల్లో చదువుకొనే విద్యార్థులు 15,500 మంది ఉన్నారు. వివిధ గ్రామాల నుంచి సైకిళ్లపై హైస్కూళ్లకు వచ్చే విద్యార్థులు సుమారు 6,500 మంది ఉన్నారని అధికారిక సమాచారం. ఒక్క పెరవలి మండలంలో 2,223 మంది ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉండగా, వారిలో సైకిళ్లపై వచ్చే వారి సంఖ్య 1050 మంది. మండలంలోని దాదాపు అన్ని పాఠశాలలు గ్రామాలకు దూరంగా ఉన్నాయి. దాదాపు సగం మంది విద్యార్థులు పాఠశాలలకు సైకిళ్లపైనే వస్తున్నారు. ఉదాహరణకు పిట్టల వేమవరం పాఠశాలకు మూడు కిలోమీటర్ల దూరంలోని దొంగరావిపాలెం నుంచి విద్యార్థులు వస్తుంటారు. అలాగే ఖండవల్లి పాఠశాలకు రెండు కిలోమీటర్ల దూరంలోని లంకమాలపల్లి గ్రామం నుంచి విద్యార్థులు రావాలి. ఇలా ప్రతి పాఠశాలకు దాదాపు 50 శాతం మంది విద్యార్థులు రెండు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం నుంచి సైకిళ్లపై వస్తున్నారు. దానికితోడు ఉపాధ్యాయుల వాహనాలు కూడా ఎండకు ఎండుతూ, వానకు తడవడంతో వారు కూడా ఇబ్బంది పడుతున్నారు. ప్రతి పాఠశాలకు రూ.లక్ష చొప్పున కేటాయించి, రేకుల షెడ్డులు నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుందని పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆరుబయట పార్కింగ్‌తో ఇబ్బందులు

వేసవిలో ఎండ ప్రభావానికి పాఠశాలల్లో ఆరుబయట పార్కింగ్ చేసిన సైకిళ్లలోని గాలి తగ్గిపోతోంది. కొన్ని సైకిళ్లకు ప్యాచీలు పడుతున్నాయి. మరికొన్నింటి పాత ప్యాచీలు కరిగిపోయి, ట్యూబుల్లోని గాలంతా పోతోంది. ఈవిధంగా సాయంత్రం స్కూల్ విడిచిపెట్టేసరికి ఒక్కో హైస్కూల్లో 10 నుంచి 20 మంది విద్యార్థుల సైకిళ్లు మొరాయిస్తున్నాయి. సైకిళ్లకు సమీపంలో ప్యాచీలు వేసుకుని ఇంటికి వెళ్లేటప్పటికి చీకటి పడుతోందని విద్యార్థులు వాపోతున్నారు.

నిధులు మంజూరైతే వెంటనే పనులు



ప్రతి ఉన్నత పాఠశాలకూ ఈ సమస్య ఉంది. సైకిల్ షెడ్డుల కోసం ప్రభుత్వానికి నివేదికలు అందించాం. నిధులు మంజూరైతే వెంటనే పనులు ప్రారంభిస్తాం.

–బి.స్వరూప్,
మండల విద్యాశాఖాధికారి, పెరవలి

నేడు జగన్ జన్మదిన వేడుకలు

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా శనివారం యర్నగూడెంలోని ఆ పార్టీ కార్యాలయం వద్ద వేడుకలు నిర్వహిస్తున్నట్టు మాజీ మంత్రి, పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయం వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకూ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రతి కార్యకర్తా శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని ఆమె కోరారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో జన్మదిన వేడుకలు నిర్వహించి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె పార్టీ శ్రేణులను కోరారు. యర్నగూడెంలోని పార్టీ కార్యాలయం వద్ద వేడుకలు జరుగుతాయి.

నిడదవోలు: పట్టణంలోని శాంతినగర్‌లోని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్నట్టు మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కొవ్వూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం కొవ్వూరు నియోజకవర్గ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు తెలిపారు. ఉదయం తొమ్మిదింటికి తాళ్లపూడి, పదింటికి చాగల్లు, 11 గంటలకు కొవ్వూరులోని పార్టీ కార్యాలయాల్లో జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తామన్నారు. మూడు మండలాల్లోనూ పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తామన్నారు. ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయడంతో పాటు కొవ్వూరు వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజన వసతి కల్పించనున్నట్టు వివరించారు.

క్లుప్తంగా

టెన్త్ పరీక్షల మోడల్ పేపర్ల ఆవిష్కరణ


టెన్త్ పరీక్షల మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ అప్పారావు, ఉపాధ్యాయులు

దేవరపల్లి: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రూపొందించిన పదో తరగతి మోడల్ పబ్లిక్ పరీక్ష పేపర్లను స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం ఎంఈఓ–2 కేఆర్ఎస్‌వీవీ అప్పారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు ఏటా యూటీఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్ పేపర్లు తయారు చేసి, విద్యార్థులకు అందజేస్తోందన్నారు. 2024 మార్చిలో నిర్వహించిన పబ్లిక్ పరీక్షల్లో 60 నుంచి 80 మార్కులకు మోడల్ పేపరులోని ప్రశ్నలే వచ్చినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ఎల్‌వీవీ రామారావు, ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్, మండల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా పరికరాల అందజేత


హైస్కూల్‌కు క్రీడా పరికరాలు అందజేస్తున్న దాత అక్కిన భూపయ్య

దేవరపల్లి: మండలంలోని త్యాజంపూడి జెడ్పీ హైస్కూల్‌కు గ్రామానికి చెందిన దాత అక్కిన భూపయ్య రూ.10 వేల విలువైన క్రీడా పరికరాలను శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు వి.విరాట్, పీడీ బుజ్జిబాబులకు పాఠశాలలో అందజేశారు. దాత భూపయ్యను పాఠశాల తరపున ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

ఫ్యాక్టరీ కార్మికులకు క్రీడాపోటీలు


టాస్ వేసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ అశిష్ గోయంకా

దేవరపల్లి: యర్నగూడెం– పోతవరం రోడ్డులోని 3ఎఫ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ కార్మికులకు యర్నగూడెంలోని బొల్లిన గంగరాజు జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను శుక్రవారం ఆ ఫ్యాక్టరీ డైరెక్టర్ అశిష్ గోయంకా ప్రారంభించారు. టాస్ వేసి కార్మికుల క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఆయన కార్మికులతో కొద్దిసేపు క్రికెట్ ఆడి సరదాగా గడిపారు. కార్యక్రమంలో ఆ ఫ్యాక్టరీ హ్యూమన్ రీసోర్స్ హెడ్ హనుమాన్, జనరల్ మేనేజర్లు విజయప్రసాద్, కరుటూరి రామకృష్ణ, హెచ్ఆర్ గాయత్రి, మేనేజర్లు శివరామకృష్ణ, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

బాలదుర్గమ్మ గుడిలో తులాభారం

దేవరపల్లి: స్థానిక బాలదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం బాలుడిని పటిక బెల్లంతో తులాభారం వేసి కుటుంబ సభ్యులు మొక్కు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన ఎండపల్లి వరుణ్ కుమార్, శ్రీలక్ష్మి దంపతుల కుమారుడు కియాన్స్ శ్రీమహినందన్‌ను పటిక బెల్లంతో తులాభారం వేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత


సంగాయగూడెంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి: వైద్య ఖర్చుల నిమిత్తం మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శుక్రవారం సాయంత్రం గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అందజేశారు. సంగాయగూడెంలో సర్పంచ్ కరుటూరి ఉషారాణి స్వగృహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన సుంకవల్లి నాగమునేశ్వకి రూ.40 వేల చెక్కును అందజేశారు. అలాగే యాదవోలు, చిన్నాయగూడెం, కొత్తగూడెం గ్రామాలకు చెందిన మగ్గురు లబ్దిదారులకు రూ.1.70 లక్షల చెక్కులను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉషారాణి, పొగాకు రైతు సంఘం అధ్యక్షులు కరుటూరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కుసులూరి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు డి. బ్రహ్మరాజు పాల్గొన్నారు.

చాగల్లు రైల్వే స్టేషన్ రహదారి ఛిద్రం


ఊనగట్ల నుంచి చాగల్లు రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి

చాగల్లు: మండలంలోని ఊనగట్ల పాపాయి చెరువు వద్ద నుంచి చాగల్లు రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు గోతులమయంగా మారింది. దాంతో రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఊనగట్ల, గరప్పాడు, నందిగంపాడు తదితర గ్రామాల ప్రజలు చాగల్లు రైల్వేస్టేషన్‌కు వెళ్లడానికి ఇది దగ్గర దారి. మార్కొండపాడు మీదుగా వెళ్లే గ్రామాల వారికి కూడా ఈ రోడ్డు చాలా అవసరం. ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొలాల రైతులు నిత్యం ఈ మార్గంపై రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డంతా గుంతలమయం కావడంతో వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు వర్షం కురిస్తే రోడ్డుపైనే నీరు నిలిచిపోతోంది. అలాంటపుడు బురదలో నుంచి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉంది. వర్షం వస్తే ఈ రోడ్డులో రాకపోకలు సాగించడం చాలాకష్టం. ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు. ఈ రహదారిని సుమారు ఐదేళ్ల క్రితమే నిర్మించినప్పటికీ వర్షాలకు గోతులు ఏర్పాడ్డాయి. పలుచోట్ల రోడ్డు ఛిద్రమై కుంగిపోయి దారుణంగా ఉంది. సంబంధిత అధికారులు ఈ రోడ్డు అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆర్టీసీ కార్గో మాసోత్సవాల ప్రారంభం

నిడదవోలు: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను పురస్కరించుకుని నిడదవోలు ఆర్టీసీ డిపోలో శుక్రవారం నుంచి జనవరి 19 వరకూ కార్గో డోర్ డెలివరీ సదుపాయం కల్పించినట్టు ఆర్టీసీ డీఎం కొడమంచిలి వెంకటేశ్వర్లు తెలిపారు. రాష్ట్రంలో నిర్దేశించిన ప్రాంతాలకు 50 కేజీల వరకూ సరకు డోర్ డెలివరీ చేస్తామన్నారు.

ఉచితంగా డోర్ డెలివరీ..

కొవ్వూరు: ఆర్టీసీ ఆధ్వర్యంలో కార్గో లగేజీని డోర్ డెలివరీ చేస్తున్నామని కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. ఐదు కిలోమీటర్ల పరిధిలో 50 కిలోల లగేజీని అతి తక్కువ ఖర్చుతో డోర్ డెలివరీ చేస్తున్నామని చెప్పారు. కేజీ లోపు రూ.22లు, కేజీ నుంచి పది కిలోల లోపు రూ.43లు, పది నుంచి 25 కిలోల లోపు రూ.62లు, 25 నుంచి 50 కిలోల లోపు లగేజికి రూ.77 చొప్పున జీఎస్టీతో కలిపి చార్జీలు వసూలు చేస్తున్నామన్నారు.

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి


కానూరు పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

పెరవలి: ప్రభుత్వం తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వైద్యులు, సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో వారు శుక్రవారం మధ్యాహ్న సమయంలో కానూరు పీహెచ్‌సీ ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది మాట్లాడుతూ 22 ఏళ్లుగా వైద్య రంగంలో సేవలు అందించిన హెల్త్ అసిస్టెంట్లను ఇప్పుడు తొలగించడం అన్యాయం అన్నారు. ఇప్పటికే వారి వయసు 50 ఏళ్లు పైబడినందున మరో వృత్తిలోకి వెళ్లలేరన్నారు. వారి కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే ఉద్యోగాలు ఇచ్చారని నేడు అదే చంద్రబాబునాయుడు వారిని తొలగించటం దారుణమన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు కె.హేమరాజు, పి తేజశ్రీ , సిబ్బంది జయమణి, సత్యేంద్ర కుమార్, విజయలక్ష్మి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో బాలలతో పనులు

బాల కార్మికుల చట్టానికి తూట్లు


వాలీబాల్ షూటింగ్ ఆడిస్తున్న చిన్నారి రోషన్


ఎగ్జిబిషన్‌లో టిక్కెట్లు చింపుతున్న బాలిక


ఎగ్జిబిషన్‌లో పాప్‌కార్న్ తయారు చేసి విక్రయిస్తున్న చిన్నారి

నిడదవోలు: పట్టణంలోని యర్నగూడెం రోడ్డులో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో నిబంధనలకు విరుద్ధంగా చిన్నారులతో పనులు చేయిస్తున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం బడిఈడు పిల్లలను స్కూళ్లలో చేర్పించి, వారికి విద్య అందించాలి. బాల కార్మికుల చట్ట ప్రకారం 14 ఏళ్ల లోపు పిల్లలు ఎక్కడా పని చేయకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. ఈ చట్టాన్ని తుంగలో తొక్కిన ఎగ్జిబిషన్ నిర్వాహకులు 8 నుంచి 14 ఏళ్ల చిన్నారులతో పనులు చేయిస్తున్నారు. 20 రోజుల క్రితం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో సుమారు 20 మంది చిన్నారులు తినుబండాల విక్రయాలు సాగిస్తున్నారు. అంతేగాకుండా వాలీవాల్ షూటింగ్, గన్ షూటింగ్, పాప్‌కార్న్ తయారీ వంటి పనులు వారితో చేయిస్తున్నారు. ఎగ్జిబిషన్‌లో సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు చిన్నారులచే వెట్టిచాకరి చేయించుకుని రోజుకి రూ. 150 చొప్పున ఇస్తున్నారు. అంతే కాకుండా ఎగ్జిబిషన్ ముగియగానే చిన్నారులచే పరిసరాలు శుభ్రం చేయించడం, సామాన్లు మోయించడం చేస్తున్నారు.

చలిగాలులు.. వర్షపు జల్లులు

- పొగాకు సాగుదారుల ఆందోళన
- తెగుళ్ల ఉధృతమయ్యే అవకాశం


దేవరపల్లిలో పడుతున్న చినుకులు

దేవరపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో కొవ్వూరు డివిజన్‌లోని మెట్ట ప్రాంతంలో చలిగాలులతో కూడిన వర్షపు జల్లులు పడుతున్నాయి. నాలుగు రోజులుగా మబ్బులతో కూడిన వాతావరణం ఏర్పడింది. రెండు రోజుల నుంచి చలిగాలులు వీయడంతో పాటు ఓ మోస్తరు వర్షం పడుతోంది. ఈ వాతావరణం పొగాకు తోటలకు నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చలిగాలులకు పొగాకు తోటల్లో తెగులు ఉధృతి పెరుగుతుందని రైతులు అంటున్నారు. ఇప్పటికే మానుమచ్చ, ఆకుముడత, నల్లకడ వంటి తెగుళ్ల ఎక్కువగా ఉన్నాయి. ఈ వాతావరణం వల్ల ఈ తెగుళ్ల మరిత వేగంగా వ్యాపించే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లోతట్టు భూముల్లో వేసిన తోటల్లో వర్షం నీరు నిల్వ ఉండి మొక్కలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. అలాగే లేతగా వేసిన వరి చేలు కోతలకు సిద్ధంగా ఉన్నాయని, గాలులకు పడిపోతున్నట్టు రైతులు తెలిపారు. మరొక వారం రోజులు ఆగితే ధాన్యం మిల్లులకు చేరి సొమ్ములు చేతికి వచ్చేవని రైతులు అంటున్నారు.

పర్యావరణ విఘాతి.. కోనోకార్పస్

- చెడు వాయువులు విడుదల చేస్తున్న చెట్లు
- తొలగించాలని కోరుతున్న మండల వాసులు


వేగేశ్వరపురంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కోనోకార్పస్ చెట్లు

తాళ్లపూడి: సాధారణంగా పచ్చని మొక్కలు, చెట్లను పర్యావరణ మిత్రులు (ఎకో ఫ్రెండ్స్)గా అభివర్ణిస్తుంటారు. ఇవి ప్రాణాధారమైన ఆక్సిజన్‌ను రిలీజ్ చేస్తూ, మానవాళికి మేలు చేస్తాయి కాబట్టి. అయితే పర్యావరణానికి హాని చేసే మొక్కలు కూడా ఉన్నాయి. వాటిలో ఒకటి కోనో కార్పస్. పచ్చదనం, ఆహ్లాదం కోసం కొన్నేళ్ల క్రితం మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డు పక్కనే నాటిన ఈ మొక్కలు ఇప్పుడు భారీ వృక్షాలుగా ఎదిగాయి. ఇప్పుడవి పర్యావరణ విఘాతాలుగా తయారయ్యాయని మండలవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేగేశ్వరపురం పుంత రోడ్డుకు ఇరువైపులా ఏడేళ్ల క్రితం పెద్ద మొత్తంలో నాటిన ఈ మొక్కలు ఇప్పుడు ఇంచుమించు 18 నుంచి 20 అడుగుల ఎత్తున పెరిగాయి. కోనోకార్పస్ జాతికి చెందిన ఈ చెట్లు ఆక్సిజన్‌కు బదులు చెడు వాయువులు వెలువరిస్తాయి. ఈ చెట్లు చూడడానికి అందంగా పచ్చగా ఉంటాయి. ఈ చెట్ల ఆకులను పశువులు తినవు. ఈ చెట్లపై పక్షులు గూళ్లు కట్టుకోవు. ఇవి పరిసరాల్లోని గాలి నాణ్యతను కలుషితం చేస్తాయి. ఆస్తమా, ఇతర శ్వాశకోశ వ్యాధులు రావడానికి కారణం అవుతాయి. అంతేగాకుండా కోనో కార్పస్ చెట్ల వేళ్లు బలంగా భూగర్భంలోకి వెళ్లి డ్రైనేజీలు, పైప్‌లైన్లను దెబ్బ తీస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇతర దేశాల నుంచి వచ్చిన ఈ జాతి మొక్కలను అప్పట్లో గ్రామాల్లో పచ్చదనం కోసం విరివిగా నాటారు. ఇప్పుడు పెరిగిన ఈ చెట్లు ప్రజల అనారోగ్య సమస్యలకు కారణం అవుతున్నందున తొలగించాలని పలువురు కోరుతున్నారు. నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టుబట్టి మరీ ఈ మొక్కలను పెద్ద మొత్తంలో నాటించారు. అప్పట్లోనే ఈ మొక్కలు నాటడంపై విమర్శలు వచ్చాయి.

రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ఉండ్రాజవరం: రైతులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ అన్నారు. మండలంలోని వడ్లూరు, చివటం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో వడ్లూరులో ఆరు, చివటంలో రెండు అర్జీలు అందినట్టు డీటీ కనకదుర్గ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు పి.వీరభద్రరావు, డి.సోమిరెడ్డి, మండల సర్వేయర్ శ్రీనివాస్, వడ్లూరు గ్రామ సర్వేయర్ జ్ఞానేశ్వరి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.